ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 19 నవంబరు 2024



పదో తరగతి పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

గుజరాతీపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఫీజు గడువును పొడిగించామని డీఈవో తిరుమల చైతన్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 26లోగా ఫీజు చెల్లించవచ్చు. రూ.50 అపరాధ రుసుముతో డిసెంబరు రెండోతేదీ వరకు, రూ.200 అపరాధ రుసుముతో డిసెంబరు తొమ్మిది వరకు, రూ.500 అపరాధ రుసుముతో డిసెంబరు 16 వరకు ఫీజు చెల్లించవచ్చు. ఈ విషయాన్ని హెచ్‌ఎంలు, విద్యార్థులు గమనించాల'ని డీఈవో తెలిపారు.



భక్తులతో కిటకిటలాడిన శ్రీముఖలింగం



ఉమారుద్ర కోటేశ్వరుడికి అభిషేకం

అంతటా శివనామస్మరణ

కార్తీకమాసం.. మూడో సోమవారం పురస్కరించుకుని అంతటా శివనామస్మరణ మార్మోగింది. శ్రీకాకుళంలోని నాగావళి నది ఒడ్డున ఉన్న ఉమారుద్రకోటేశ్వరాలయం, రావివలసలోని ఎండలమల్లన్న ఆలయం, దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వరాలయంలో భక్తుల రద్దీ కనిపించింది. సోమవారం వేకువజాము నుంచే భక్తులు క్యూలో బారులుదీరి మహాశివుడ్ని దర్శించుకుని.. పూజలు, అభిషేకాలు చేశారు.

6లో



ఎండలమల్లికార్జున స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

గంటల వ్యవధిలోనే..

- బావ, బావమరిది దుర్మరణం
- లారీ ఢీకొని రోడ్డు ప్రమాదం
- ఇచ్ఛాపురంలో విషాదం



బావ, బావమరిది: వంశీ, కృష్ణ (ఫైల్)

ఇచ్ఛాపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వారిద్దరూ బావ.. బావమరిది. అక్క పురిటినొప్పులతో బాధపడుతుండడంతో ఆదివారం సాయంత్రం ఆస్పత్రిలో చేర్పించాడు. బావను కూడా తీసుకురమ్మని అక్క చెప్పడంతో బరంపురం వెళ్లాడు. అక్కడ నుంచి ద్విచక్ర వాహనంపై ఇద్దరూ వస్తుండగా.. రోడ్డు ప్రమాదంలో బావమరిది అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన బావ కూడా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతి చెందాడు. గంటల వ్యవధిలోనే బావ.. బావమరిది మృతి చెందడంతో ఆ ఇంట తీరని విషాదం అలుముకుంది. భార్య ప్రసవించిన రెండు గంటల్లోనే.. భర్త ప్రాణాలు కోల్పోవడం మరింత బాధాకరంగా మారింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

● ఇచ్ఛాపురంలోని హర్షమోటార్స్ జంక్షన్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇచ్ఛాపురం పట్టణంలోని బలరాంపేటకు చెందిన ఉయ్యాల వంశీ(24) మృతి చెందాడు. ఆయనతోపాటు గాయపడిన బావ కృష్ణ(32) బరంపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున ప్రాణాలు కోల్పోయాడు. బలరాంపేటకు చెందిన వంశీ ఇచ్ఛాపురంలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నాడు. తండ్రి కొన్నాళ్ల కిందట చనిపోగా.. తల్లి సుగుణతో కలిసి జీవిస్తున్నాడు. తన అక్క దేవీకి ఏడాది కిందట బరంపురానికి చెందిన కృష్ణతో వివాహమైంది. ఆమె ప్రస్తుతం 9 నెలల గర్భిణి. ఇటీవల కన్నవారింటికి దేవీ వచ్చింది. కృష్ణ బరంపురంలోనే ఉంటున్నాడు. కాగా.. ఆదివారం పురిటినొప్పులు రావడంతో దేవీని ఇచ్ఛాపురంలోని ప్రైవేటు ఆస్పత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. బావను కూడా తీసుకురమ్మని దేవీ చెప్పడంతో.. వంశీ బరంపురం వెళ్లాడు. ఆదివారం రాత్రి బావ..బావమరిది ఇద్దరూ ద్విచక్రవాహనంపై వస్తుండగా.. 8 గంటల సమయంలో ఇచ్ఛాపురంలోని హర్షమోటార్స్ జంక్షన్ వద్ద ఓ లారీ ఢీకొంది. దీంతో వంశీ అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్రంగా గాయపడిన కృష్ణను సీహెచ్‌సీకి స్థానికులు, కుటుంబ సభ్యులు తరలించారు. పరిస్థితి విషమించడంతో కృష్ణను బరంపురంలో ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున 3 గంటల సమయంలో ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వంశీ, కృష్ణ మృతదేహాలను పోస్టుమార్టం కోసం సీహెచ్‌సీకి తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చిన్నంనాయుడు తెలిపారు.

● ఇదిలా ఉండగా పురిటినొప్పులతో ఆస్పత్రిలో చేరిన కృష్ణ భార్య దేవీ ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత 1 గంట సమయంలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అక్కడికి మరో రెండు గంటల వ్యవధిలో కృష్ణ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. దేవీ ఆస్పత్రిలోనే ఉంది. తమ్ముడు, భర్త చనిపోయాడనే వార్త ఆమెకు ఎలా చెప్పాలో తెలియక కుటుంబ సభ్యులు లోలోపల పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకుంటున్నారు. గంటల వ్యవధిలోనే కన్నకొడుకు వంశీ, అల్లుడు కృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో.. 'అయ్యో.. దేవుడా.. మాపై ఎందుకు ఇంత కక్ష కట్టావ'ని తల్లి సుగుణ విలపించారు. ఆమె రోదన చూపరులకు కంటతడి తెప్పించింది.

అర్జీలు సరే.. పరిష్కారం ఎప్పుడో?

ఆంధ్రజ్యోతి విజిట్

- సమస్యలపై సుదీర్ఘకాలంగా.. వినతులు ఇస్తూనే..
- 'మీ-కోసం'లో ఫిర్యాదులకు కానరాని మోక్షం



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అర్జీలు పరిష్కరించాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక.. 'మీ-కోసం'లో వచ్చిన అర్జీలను పెండింగ్‌లో లేకుండా.. తక్షణమే వాటిని పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన మీ-కోసం కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వారి నుంచి 73 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వేంకటేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం/ కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వారు సమస్యల పరిష్కారం కోసం ప్రతివారం జిల్లా కేంద్రానికి వస్తూ.. వినతులు ఇచ్చిపోతున్నారు. ఈసారి అయినా తమ సమస్యకు మోక్షం లభిస్తుందని ఆశగా వెళ్తున్నారు. కానీ వారాల తరబడి అదేతంతు. సోమవారం శ్రీకాకుళం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమస్యల పరిష్కార వేదిక 'మీ కోసం'పై 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేయగా.. ఒకే సమస్య కోసం పలుమార్లు వినతులు ఇచ్చినవారే అధికంగా కనిపించారు. ఈ సందర్భంగా వారాల తరబడి తాము పడుతున్న కష్టాలను.. సమస్యల పరిష్కారం కోసం ఇచ్చిన వినతుల గురించి చెప్పి వాపోయారు.

● ఫించనూ లేదు.. కార్డూ లేదు...



మా గ్రామంలో వైసీపీ నాయకులు మా భూమిని ఆక్రమించుకున్నారు. మా భూమిలో మొక్కలు నాటడమే కాకుండా.. ఇంటిని ఆక్రమించి గోడ నిర్మించారు. దీనిపై కోర్టులో కేసు వేశాం. ఇదిలా ఉండగా టీడీపీ ప్రభుత్వ హయాంలో మాకు రేషన్ కార్డు ఉండేది. వైసీపీ వచ్చాక కార్డును తొలగించేశారు. రేషన్‌కార్డుతోపాటు వృద్ధాప్య దశలో ఉన్న నాకు పింఛన్ కూడా మంజూరు చేయాలని 2019 నుంచీ వినతులు అందజేస్తూనే ఉన్నాను. అయినా నా సమస్యకు పరిష్కారం చూపడం లేదు.

-చెంచలి దుర్గమ్మ, యలమంచిలి, జలుమూరు మండలం

ఉపాధి కల్పించాలి..



నేను ఇంటర్‌మీడియట్ చదివాను. నాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉపాధి అవకాశంలేదు. నేను దివ్యాంగుడిని. రెండేళ్లుగా ఉపాధి అవకాశం కల్పించాలని.. ప్రభుత్వ సహకారం కావాలని అధికారులను కోరుతున్నా. ఎన్నో సార్లు 'మీ-కోసం' కార్యక్రమంలో వినతిపత్రాలు అందజేశాను. ఉపాధి కల్పిస్తారని ఎదురు చూస్తున్నాను.

- గెడ్డి గురునాయుడు, వెంకటాపురం, లావేరు మండలం

● గుర్రపుడెక్క తొలగించడం లేదు..



నా వయస్సు 79. నేను మాజీసైనికుడ్ని. సంతఉరిటి, దవళపేట, ఆనందపురం, ఆబోతులపేట, కొల్లిపేట గ్రామాలకు మడ్డువలస ప్రాజెక్టు ద్వారా 3వేల ఎకరాలకుపైగా శివారు భూములకు సాగునీరు అందడం లేదు. కాలువ మొత్తం గుర్రపుడెక్కతో నిండిపోయింది. రెల్లిపొద దట్టంగా పెరిగిపోయి సాగునీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడింది. కాలువలలో పూడిక, పిచ్చిమొక్కలు తొలగించకపోవడంతో రైతులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. దీనిపై ఎన్నోసార్లు ఫిర్యాదు చేశాను. స్థానిక నాయకుల నుంచి.. ఉన్నతస్థాయి అధికారులు కూడా పట్టించుకోలేదు. ఇప్పుడైనా చర్యలు తీసుకోవాలి. రైతుల ప్రయోజనంపై శ్రద్ధ వహించాలి.

- బొడ్డేపల్లి ఆనందరావు (మాజీ సైనికుడు), దవళపేట, జి.సిగడాం మండలం

రామసాగరం చెరువును ఆక్రమించేశారు



మా గ్రామంలో సర్వే నంబర్ 185లో 'రామసాగరం' అనే సాగునీటి చెరువు ఉంది. దీని విస్తీర్ణం 15 ఎకరాలు. ఇందులో ఐదు ఎకరాలకుపైగా గ్రామంలో కొంతమంది ఆక్రమించి వ్యవసాయ భూమిగా మార్పు చేసుకున్నారు. గ్రామం మొత్తానికి ఇటు సాగునీటికీ, అటు తాగునీటి వనరుగా ఈ చెరువే ఆధారం. భారీవర్షాలు కురిస్తే... చెరువులో నీటిని ఆక్రమణదారులు విడిచిపెట్టేస్తున్నారు. దీనిపై మూడుసార్లు ఫిర్యాదు చేశాను. అలాగే నీటిలో ఫ్లోరిన్ కంటెంట్‌తో గ్రామంలో పలువురు మృత్యువాత పడ్డారు. దీనిపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

- వావిలపల్లి చక్రధరరావు, గురుగుబిల్లి కృష్ణారావు, పిల్లలవలస, పొందూరు మండలం

రబీపై నిరాశ

● వంశధార సాగునీరు లేనట్టే! ● ఆందోళనలో అన్నదాతలు



నరసన్నపేట: నీరులేని ఎన్‌బీసీ కాలువ

సరుబుజ్జిలి/ నరసన్నపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రబీ సాగుపై రైతుల్లో సందిగ్ధం నెలకొంది. ప్రధానంగా రబీసాగుకు అవసరమైన వంశధార సాగునీరు ఈ ఏడాది పూర్తిస్థాయిలో అందే పరిస్థితి లేక అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల సరుబుజ్జిలిలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్‌తోపాటు వంశధార ఇంజనీరింగ్ అధికారులు సాగునీటి విడుదలపై చర్చించారు. హిరమండలం వంశధార జలాశయంలో అనుకున్న స్థాయిలో నిల్వలు లేక రబీ సాగుకు నీరు విడుదల చేసే పరిస్థితి కనిపించడం లేదని ప్రకటించారు. దీంతో ఇప్పటికే రబీ సాగుకు సిద్ధమైన రైతులు నిరాశ చెందుతున్నారు.

వంశధార తీర ప్రాంత మండలాల్లో ఏటా రబీ సీజన్‌లో సుమారు 40వేల ఎకరాల్లో వరి సాగుచేసేవారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో వరికి బదులు అపరాలు, ఇతర ఉద్యానపంటలు సాగు చేసేందుకు చాలా మంది రైతులు సన్నద్ధమయ్యారు. సరుబుజ్జిలి, నరసన్నపేట, ఎల్.ఎన్.పేట, బూర్జ, ఆమదాలవలస, గార, శ్రీకాకుళం, జలుమూరు, పోలాకి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి తదితర మండలాలకు చెందిన రైతులు ఏటా వంశధార నీటి ఆధారంతోనే రబీ సాగు చేసేవారు. కాగా ఈ ఏడాది విత్తనాలతోపాటు సాగునీటి పరిస్థితులు కూడా అనుకూలంగా లేకపోవడంతో మదనపడుతున్నారు. హిరమండలం జలాశయంలో 11 టీఎంసీల నీటికిగానూ ప్రస్తుతం కేవలం 3 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఒడిశాలో కూడా అనుకున్నస్థాయిలో వర్షాలు కురవకపోవడమే ఇందుకు కారణమని వంశధార అధికారులు తెలిపారు. ఉన్న మూడు టీఎంసీల వంశధార నీటిని గత ప్రభుత్వ జీవో ప్రకారం రెండు టీఎంసీలను ఉద్దానం తాగునీటి కోసం వినియోగించుకోవాల్సిన ఉందన్నారు. దీంతో జలాశయం ద్వారా రబీ సాగుకు నీరందించే పరిస్థితి కనిపించడం లేదని తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఆశాజనకంగా ఉన్నా.. రబీపై మాత్రం నిరాశ తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. కొన్ని గ్రామాల రైతులు చెరువుల నీటి ద్వారా రబీసాగుకు సిద్ధమవుతున్నా.. చివరి దశలో ఇబ్బందులు తప్పవేమోనని ఆందోళన చెందుతున్నారు. జలుమూరు మండలం కోమనాపల్లి, జలుమూరు, యలమంచిలి తదితర ప్రాంతాల్లో నారు మళ్లు సిద్ధం చేస్తున్నారు. గత మూడు రోజులుగా వంశధార కాలువల్లో నీటి మట్టం తగ్గడంతో అయోమయం చెందుతున్నారు. హిరమండలం జలాశయం పనులు పూర్తి చేయకపోవడంతో భవిష్యత్‌లో కూడా తమకు సాగునీటి ఇబ్బందులు తప్పవని వాపోతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి రబీలో సాగునీటి కష్టాలు లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



నీటి ప్రవాహం లేని వంశధార పిల్లకాలువ

బాధాకరంగా ఉంది..

ప్రతి ఏడాది వంశధార సాగునీటి లభ్యతతో రబీ సాగు రెండో పంటగా వరి పండించేవాళ్లం. ఈ ఏడాది వంశధార నీటి కొరత ఏర్పడింది. దీంతో రబీ సాగు చేయలేకపోవడం బాధాకరం.

-బెవర రమణమూర్తి, రైతు, రొట్టవలస

సాగునీటి కొరతతో..

ఖరీఫ్ సాగుకు ఆశాజనకంగా ఉండడంతో ఎంతో ఆనందపడ్డాం. కానీ, రబీ సీజన్‌లో సాగునీటి కొరత కారణంగా రెండో పంట వేయలేకపోతున్నాం. అన్నదాతలకు నిరాశ తప్పడం లేదు.

-సైలాడ దాసునాయుడు, రైతు, సైలాడ సర్పంచ్

నేటి నుంచి బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అనుబంధ బీఈడీ కళాశాలల విద్యార్థులకు రెండో సెమిస్టర్ పరీక్షలు మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు ఎగ్జామినేషన్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పేర్కొన్నారు. పాలకొండ, టెక్కలి, పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, రాజాం జీసీఎస్‌ఆర్ కళాశాల, అంబేద్కర్ వర్సిటీ కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

గ్రంథాలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

● కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు



మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

అరసవల్లి/శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు తమ వంతుగా సాయం చేయాలనే ఉద్దేశంతో కేంద్రగ్రంథాలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని కేంద్రపౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళంలో కేంద్ర గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన వారోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎర్రన విద్యాసంకల్పం కింద బీరువాతో పాటు.. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను బహూకరించారు. ముందుగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి దివంగత కేంద్రమంత్రి ఎర్రన్నాయుడు చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ కేంద్ర గ్రంథాలయానికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. గ్రంథాలయాలను ఉపయోగించుకుని విద్యార్థులు పోటీ పరీక్షలలో విజయం సాధించి.. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఉత్తమ గ్రంథపాలకులు ఎం.చంద్రశేఖర్, జి.గోవిందరావు, కె.చిరంజీవులు, ఎస్.చాయారతన్, కాళ్ళ రాజు, ఎస్.వి.రమణమూర్తిని సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు, కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వీవీజీఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ భాస్కరరాజా, జిల్లాలోని గ్రంథాలయాధికారులు పాల్గొన్నారు.

అంతటా శివనామస్మరణ

కార్తీకమాసం మూడో సోమవారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణతో మార్మోగాయి. మహాశివుడి దర్శనానికి తెల్లవారుజాము నుంచే భక్తులు బారులుదీరారు. అభిషేక ప్రియుడికి పూజలు చేశారు. శ్రీకాకుళంలోని పలు శివాలయాల్లోను, టెక్కలిలోని ఎండల మల్లన్న ఆలయంలోను, జలుమూరులోని శ్రీముఖలింగేశ్వరుడికి అభిషేకాలు జరిపారు. భక్తులకు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ప్రసాదాలు, మంచినీరు అందజేశారు.


పూజలందుకుంటున్న శ్రీముఖలింగేశ్వరుడు


శ్రీముఖలింగంలో ప్రత్యేక దర్శనం కోసం క్యూలో నిరీక్షిస్తున్న భక్తులు

- ఆలయాల్లో మూడో సోమవారం పూజలు
- మహాశివుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- నాగావళి ఒడ్డున దీపాలు వెలిగించిన మహిళలు

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి)

కార్తీకమాసం మూడో సోమవారం ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. నగరంలోని నాగావళి ఒడ్డున ఉన్న ఉమా రుద్రకోటేశ్వరాలయంలో తెల్లవారుజామున 4 నుంచే భక్తులు నదీ స్నానాలు చేసి స్వామిని దర్శించుకున్నారు. ఈశ్వరుడు అభిషేక ప్రియుడు కావడంతో మహాన్యాస పూర్వక అభిషేకాలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఆరవెల్లి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో స్వామిని, రాజరాజేశ్వరి అమ్మవారిని అలంకరించారు. మహిళలు ముందుగా నందీశ్వరుని వద్ద దీపాలు వెలిగించారు. స్వచ్ఛంద సంస్థలు క్యూలైన్‌లో ఉన్న వారికి ప్రసాదాలు, మంచినీటి ప్యాకెట్లు అందజేశాయి. నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరాలయంలో భక్తులు కిక్కిరిశారు. కొన్నావీధిలో భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గుజరాతీపేటలోని లక్ష్మేశ్వరస్వామి ఆలయంలో, బలగలోని ఉత్తరేశ్వరాలయంలో, దీపామహల్ వెనుక ఉన్న కాశీవిశ్వేశ్వర ఆలయంలో, మహాలక్ష్మి నగర్ కోలనీలో ఉన్న మండలేశ్వరాలయంలో, పాలకొండ రోడ్డులో ఉన్న నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొందిలీపురం షిరిడి సాయిబాబా ఆలయంలోని శివలింగానికి క్షీరాభిషేక పూజలు చేశారు. దూది వారి కోవెల వెంకటేశ్వరస్వామి ఆలయంలో, విశాఖ ఎ కోలనీలో ఉన్న శివబాలాజీ ఆలయంలో, కలెక్టర్ బంగ్లా వద్ద ఉన్న కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కూడా భక్తులు బారులుదీరి కనిపించారు.

హర హర మహదేవ..

జలుమూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగం కార్తీక మూడో సోమవారం కిటకిటలాడింది. శంభో శంకర హర హర మహేదేవ నామస్మరణతో హోరెత్తింది. భక్తులు వేకువజాము నుంచే వంశధారనదిలో స్నానాలు ఆచరించి శ్రీముఖలింగేశ్వరుని దర్శించుకుని అభిషేకాలు చేశారు. ఉదయం 8 గంటల నుంచి రద్దీ అధికమైంది. భక్తులకు ఉచిత, ప్రత్యేక దర్శనాలకు ఏర్పాటు చేసిన బారికేడ్లు నిండిపోయాయి. భక్తులు ఆలయం నుంచి భీమేశ్వరాలయం వీధి వరకు బారులు తీరారు. దర్శనానికి 3 గంటలపైనే పట్టింది. సాయంత్రం 6 గంటలు వరకు రద్దీ కొనసాగింది. సత్యసాయి భక్తులు త్రాగునీరు అందించారు. రాధాకృష్ణ మఠం వద్ద అన్నసంతర్పణ నిర్వహించారు. శ్రీముఖలింగేశ్వరస్వామితో పాటు సోమేశ్వర, భీమేశ్వరాలయాల్లోను భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.


ఎండలమల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ

దారులన్నీ ఎండల మల్లన్న వైపే..

టెక్కలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రావివలస ఎండల మల్లికార్జునస్వామిని సోమవారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. పొలంగట్లు, చెరువుగట్లు, రాక, పోక మార్గాలు ఇలా ఎటుచూసినా జనంతో కనిపించాయి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా దేవాదాయశాఖ క్యూలైన్లు ఏర్పాటు చేసింది. అయినా ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. సీఐ విజయ్‌కుమార్ రావివలసలకు రెండు కిలోమీటర్ల దూరంలోనే ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేయించారు. ఈవో జి.గురునాథరవు తదితరులు పాల్గొన్నారు.


నక్కవీధి ఉమాజఠలేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


రావివలసలో చెరువు గట్టుపై నుంచి వస్తున్న భక్తులు


బలగ జంక్షన్‌లోని ఉత్తరేశ్వరాలయంలో పూజలు


కోటేశ్వర స్వామి ఆలయంలో ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో
మందుల కొరత లేదు

- కుక్కకాటు, పాముకాటు ఇంజక్షన్లు కూడా ఉన్నాయి
- అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నాం.
- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డాక్టర్ మీనాక్షి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



అరసవల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, ఎలాంటి కొరత లేదని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి.మీనాక్షి అన్నారు. కుక్కకాటు, పాముకాటు ఇంజక్షన్లు కూడా సరిపడా ఉన్నాయని చెప్పారు. నాణ్యమైన వైద్యం అందించి ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగిస్తున్నామని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఆమె పలు అంశాలపై 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

● **ప్రశ్న:** జిల్లాలో అంటువ్యాధులు ప్రబలకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

● **జవాబు:** అంటు వ్యాధులు ప్రబలకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో 84 పీహెచ్‌సీలు ఉన్నాయి. ప్రతీ పీహెచ్‌సీలో ఒక ర్యాపిడ్ టీమ్ ఏర్పాటు చేశాం. ఒక వైద్యుడు, స్టాఫ్‌నర్సు, ఏఎన్‌ఎం, ల్యాబ్ టెక్నీషియన్ ఈ టీమ్‌లో ఉంటారు. గ్రామాల్లో ఎటువంటి సమస్య ఉన్నా వెంటనే ఈ టీమ్ అక్కడికి చేరుకుని వైద్యసేవలు అందిస్తుంది. ఈ టీమ్‌లను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో ఒక టీమ్ ఉంటుంది. అత్యవసర సేవల కోసం ఒక ఫోన్ నెంబరు కూడా కేటాయించాం.

● **ప్ర:** చలికాలంలో ఎటువంటి వ్యాధులు ప్రబలతాయి?

● **జ:** చలికాలంలో ఎక్కువగా పిల్లల్లో న్యూమోనియా ప్రబలే అవకాశం ఉంటుంది. దీనికి సంబంధించి ఇప్పటికే సాన్స్ ప్రోగ్రాం అమలు చేస్తున్నాం. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి 0-5 ఏళ్ల మధ్య వయసు గల పిల్లలను గుర్తిస్తారు. వారిలో ఎటువంటి లక్షణాలు కనబడినా వెంటనే అవసరమైన మందులు అందజేస్తారు.

● **ప్ర:** కుక్కకాటు, పాముకాట్లు ప్రస్తుతం ఎక్కువగా ఉన్నాయి. ఏఆర్‌వీ, ఏఎస్‌వీ ఇంజక్షన్లు సరిపడ ఉన్నాయా?

● **జ:** జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో మందుల కొరత లేదు. అన్ని రకాల వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. వ్యాక్సిన్లు నిల్వ ఉంచేందుకు గతంలో సరిపడ ఫ్రీజర్లు ఉండేవి కావు. ఇప్పుడు ఆ సమస్య కూడా లేదు.

● **ప్ర:** చాలామంది ప్రభుత్వ వైద్యాధికారులు స్థానికంగా నివాసం ఉండడం లేదు. వారిపై చర్యలు తీసుకుంటారా?

● **జ:** పీహెచ్‌సీల వైద్యాధికారులు ఆసుపత్రికి 8 కిలోమీటర్ల పరిధిలో నివాసం ఉండాలి. 24 గంటలూ వైద్యసేవలు అందించడానికి అందుబాటులో ఉండాలి. కానీ, కొందరు వైద్యాధికారులు పట్టించుకోవడం లేదు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నాం.

● **ప్ర:** పీహెచ్‌సీల్లో ప్రసవాల లక్ష్యం చేరుకుంటున్నారా?

● **జ:** పీహెచ్‌సీల్లో ప్రసవాల టార్గెట్ రీచ్ కావడం లేదు. హిరమండలం, మెళియాపుట్టి పీహెచ్‌సీల్లో మాత్రమే అధిక ప్రసవాలు జరుగుతున్నాయి. అత్యల్ప ప్రసవాలు నమోదవుతున్న పీహెచ్‌సీలకు నోటీసులు ఇస్తున్నాం. వైద్యులు, సిబ్బంది మరింత బాధ్యతగా పని చేయాల్సిన అవసరం ఉంది. కొంతమంది ఆశాలు, ఏఎన్‌ఎంలు కమీషన్ కోసం ప్రసవాల కేసులను ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రసవాల సంఖ్య ప్రభుత్వాసుపత్రుల్లో 40 శాతం ఉంటే, ప్రైవేటు ఆసుపత్రుల్లో 60శాతం ఉంటున్నాయి.

● **ప్ర:** క్యాన్సర్ కేసులపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

● **జ:** జిల్లాలో నోటి, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఇంటింటికీ వెళ్లి దీనిపై సర్వే ప్రారంభించాం. సీహెచ్‌సీ వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, బీఎస్సీ నర్సింగ్ చివరి సంవత్సర విద్యార్థులకు ఇప్పటికే దీనిపై శిక్షణ అందించాం. ప్రతీ సీహెచ్‌సీలో ఒక గైనిక్, దంతవైద్యుడు అందుబాటులో ఉండి, పరీక్షిస్తారు. త్వరలోనే పూర్తి వివరాలు అందుబాటులోకి వస్తాయి.

● **ప్ర:** వైద్య సిబ్బంది డెప్యుటేషన్లను రద్దు చేస్తున్నారా?

● **జ:** బదిలీలు, డెప్యుటేషన్లపై 2022 సంవత్సరం నుంచి నిషేధం ఉంది. ఇంతవరకు మేము ఎటువంటి బదిలీలు చేయలేదు. సిఫారసులపై ఎవరైనా వస్తే కలెక్టర్‌కు నివేదించి, వారి ఆదేశాల ప్రకారం ముందుకు వెళ్తున్నాం.

సీనియర్ సిటిజన్లకు ఆర్టీసీ రాయితీ

- టిక్కెట్‌లో 25 శాతం మేర..
- ఆనందం వ్యక్తం చేస్తున్న వృద్ధులు
- ఆరు రకాల గుర్తింపు కార్డులకు అనుమతి
- ఏ రాష్ట్రం వ్యక్తయినా వర్తింపు



నరసన్నపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే సీనియర్ సిటిజన్లకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రాయితీ ప్ర కటించింది. 60 ఏళ్లు దాటిన వారు తమ స్వస్థలం నుంచి బస్సుల్లో ప్రయాణించే సమయంలో టికెట్ ధరలో 25 శాతం తగ్గించి చెల్లించవచ్చని స్పష్టం చేసింది. ఈమేరకు ఏపీ ఎస్‌ఆర్‌టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఈ నెల 13న ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఉన్న రాయితీ ఉత్తర్వులను పరిగణలోకి తీసుకుని రాయితీని 25 శాతానికి పెంచుతూ కొత్తగా ఆదేశాలు ఇచ్చారు. అయితే ప్రయాణ సమయంలో సీనియర్ సిటిజన్లు తన గుర్తింపు కార్డును కండక్టర్ చూపించాల్సి ఉంటుంది. ఆధార్, సీనియర్ సిటిజన్ ఐడీ కార్డు, పాన్‌కార్డు, ఓటర్ ఐడీ కార్డు, పాస్‌పోర్ట్, రేషన్‌కార్డుల లో ఏదైనా ఒకటి టికెట్ కొనుగోలు సమయంలో చూపించాల్సి ఉందని ఆ ఉత్తర్వుల్లో ఆర్టీసీ ఈడీ స్పష్టం చేశారు. గుర్తింపు కార్డుల్లో ఒరిజనల్ అందుబాటులో లేకపోతే సెల్‌ఫోన్‌లో ఫొటో చూపించినా అనుమతి ఇవ్వాలని ఆదేశించారు. ఏ రాష్ట్రానికి చెందిన వ్యక్తి అయినా ఆంధ్రప్రదేశ్‌లో ప్రయాణం చేసే సమయంలో ఈ రాయితీ వర్తిస్తుంది. ఈ అవకాశాన్ని సీనియర్ సిటిజన్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ఎంతో ఉపయోగం..



ఆర్టీసీ తీసుకున్న నిర్ణయం చాలా సంతోషదాయం. మా లాంటి సీనియర్ వృద్ధులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఎప్పుడో ప్రయాణాలు చేస్తుంటాం. ఆ సమయంలో రాయితీ ఇవ్వడం ఆనందంగా ఉంది.

-సత్యనారాయణ, రిటైర్డు అధ్యాపకుడు, నరసన్నపేట

ఆనందంగా ఉంది..



నేను మా ఊరు నుంచి నెలకు రెండుసార్లు శ్రీకాకుళం ఆసుపత్రికి వెళ్తాను గతంలో ఆర్టీసీ బస్సు టిక్కెట్‌పై 10 శాతం రాయితీ ఇచ్చేవారు. ఇప్పుడు 25శాతానికి పెంచడం ఆనందంగా ఉంది. రాయితీ ఇవ్వడం వల్ల కొంత డబ్బులు మిగులుతాయి. ఇవి మందులకు సర్దుబాటు అవుతాయి. బస్సుల్లో వయో వృద్ధులకు సీట్లు కూడా పెంచితే బాగుంటుంది.

-రెడ్డి రామమూర్తి, జమ్ము

సద్వినియోగం చేసుకోవాలి..

సీనియర్ సిటిజన్లకు ప్రయాణం సమయంలో టిక్కెట్‌పై 25శాతం రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన మాట వాస్తవమే. ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఆరు రకాల కార్డుల్లో ఏదో ఒకటి చూపించి వయస్సు నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. ఒరిజనల్ గుర్తింపు కార్డులు తప్పనిసరిగా చూపించాలి. వాటిని ఫోన్‌లో చూపించినా అనుమతి ఇస్తాం. డూప్లికేట్ (జిరాక్సు కాపీలు) చెల్లవు.

-ఎన్.శ్రీనివాసరావు, టెక్కలి ఆర్టీసీ డిపో మేనేజర్

అసెంబ్లీలో సిక్కోలు గళం


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు గౌతు శిరీష, మామిడి గోవిందరావు, నడుకుదిటి ఈశ్వరరావు

జిల్లాలోని పలు సమస్యలను ఎమ్మెల్యేలు సోమవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. కిడ్నీ వ్యాధి సమస్యపై ఎమ్మెల్యే శిరీష, మెళియాపుట్టిలో ఐటీడీఏ, గిరిజన గ్రామాల సమస్యలపై ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రస్తావించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ వివరాలు ఇలా..

ఉద్దానం కిడ్నీ వ్యాధిగ్రస్థులను కాపాడండి: గౌతు శిరీష

పలాస, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉద్దానం ప్రాంత గ్రామాలను పట్టిపీడిస్తున్న కిడ్నీ వ్యాధిని నివారించి బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె అసెంబ్లీ సమావేశంలో మాట్లాడుతూ.. ఆరోగ్యశాఖ మంత్రి జిల్లాలో పర్యటించి కిడ్నీ పరిశోధన కేంద్రానికి అదనపు సదుపాయాలు కల్పించాలని కోరారు. ఉద్దానం కిడ్నీ వ్యాధులపై జరుగుతున్న పరిణామాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఉద్దానం అనగానే జీడి, కొబ్బరి తోటలతో పాటు ప్రమాదకరమైన కిడ్నీ సమస్య గుర్తుకువస్తుందన్నారు. 2018లో అప్పటి టీడీపీ హయాంలో నాటి ఆరోగ్యమంత్రి కామినేని శ్రీనివాస్ పలాస, హరిపురం, కవిటి, సోంపేట, ఇచ్ఛాపురంలలో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసి కిడ్నీ వ్యాధి గ్రస్థులకు యుద్ధ ప్రాతిపదికన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. అయినా సమస్య కొలిక్కి రాలేదని, మనుషులు పిట్టల్లా రాలిపోతున్నారని, 2023లో వైసీపీ హయాంలో ఆసుపత్రి, కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని ప్రారంభించినా సక్రమంగా నిర్వహణ చేయలేకపోయారన్నారు. ఆసుపత్రిలో 73 మంది వైద్యులను నియమించాల్సి ఉండగా కేవలం పదిహేను మంది మాత్రమే ఉన్నారన్నారు. అదికూడా ఎన్నికల ముందు తూతూ మంత్రంగా వారిని నియమించారన్నారు. ఆసుపత్రిలో రెండు లక్షల మంది ప్రజలకు వైద్యం అందించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో ఇతర ఆసుపత్రుల్లా కాకుండా ఉద్దానాన్ని పట్టిపీడిస్తున్న కిడ్నీ వ్యాధిపై ప్రత్యేక దృష్టి సారించి వైద్యులను నియమించాలని కోరారు. వైద్యులు కూడా వ్యాధిబారిన పడతారనే అపోహతో అక్కడకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పరిశోధన కేంద్రంలో ప్రస్తుతం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పరిశోధన చేస్తున్నారన్నారు. కిడ్నీ వ్యాధి నివారణకు చర్యలు తీసు కుని బాధితులను ఆదుకోవాలని కోరారు.

మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి: ఎంజీఆర్

పాతపట్నం నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మెళియాపురం మండల కేంద్రంలో ఐటీడీఏను ఏర్పాటు చేయాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. సోమవారం రాష్ట్ర శాసనసభలో ఆయన మాట్లాడారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో జిల్లా ఐటీడీఏను కోల్పోయిందన్నారు. జిల్లాలో ఐదు మండలాల్లో సుమారు 50 వేల మందికి పైగా గిరిజనులున్నారని, ఈ నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలో మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు ద్వారా గిరిజనులకు అనుకూలంగా ఉంటుందన్నారు. పలు గిరిజన గ్రామాల్లో నేటికీ మౌలిక సదుపాయాలు లేని పరిస్థితి ఉందన్నారు. కనీసం రోడ్లు లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవల కోసం డోలీల సాయంతో ఆసుపత్రులకు తరలించాల్సి వస్తోందని ప్రస్తావించారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవల కోసం పక్కనున్న ఒడిశా రాష్ట్రానికి లేకుంటే 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా ప్రధాన కేంద్రం శ్రీకాకుళానికి తీసుకువెళ్లాల్సిన పరిస్థితులున్నాయన్నారు. అందువల్ల మెరుగైన వైద్య సేవల కోసం అధికంగా నిధులు కేటాయించాలని, గిరిజనుల అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

పరిశ్రమల్లో స్థానికులకే ఉపాధి కల్పించాలి: ఈశ్వరరావు

రణస్థలం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల నియోజకవర్గంలోని పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు కోరారు. శాసనసభలో ఆయన సోమవారం మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతంగా గుర్తించి దశాబ్దాల కిందట పైడిభీమవరంలో పారిశ్రామికవాడ ఏర్పాటు చేశారని, అప్పట్లో తమ పిల్లలకు ఉద్యోగాలు లభిస్తాయని ఆశించి విలువైన భూమిని ఆ ప్రాంతీయులు త్యాగం చేశారని గుర్తుచేశారు. కానీ స్థానికులకు కనీస స్థాయిలో కూడా ఉపాధి దొరకడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. పేరు మోసిన రసాయన పరిశ్రమలు ఉన్నాయని, అక్కడ 30 వేల మంది ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. కానీ ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఇంటికి ఒకరు చొప్పున గ్రాడ్యుయేషన్ చదువుకున్న విద్యార్థులు ఉన్నా ఉద్యోగాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. హైదరాబాద్, బెంగళూరు వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లి యువత ఉద్యోగాలు చేసుకోవాల్సి వస్తోందని తెలిపారు. స్థానికుల త్యాగాలు వృథా అవుతున్నాయని వాపోయారు. డిగ్రీ చదివిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలని, అందుకే స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలన్న ప్రత్యేక జీవో తీసుకురావాలని కోరారు. స్థానిక రసాయన పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థాలు నేరుగా సముద్రంలో విడిచిపెట్టడంతో మత్స్య సంపద నశించి పోతోందని, మత్స్యకారులకు వేటలేక పూట గడవని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు.

నేటి నుంచి నీటి సరఫరాకు అంతరాయం

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంనగరంలో మంగళవారం నుంచి రెండురోజుల పాటు మంచి నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని కమిషనర్ పీవీవీ ప్రసాదరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక బొందిలీపురం చేపల మార్కెట్ సమీపంలో 600 ఎంఎం మెయిన్ పంపింగ్ పైపులైన్ పాడవడంతోపనులు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం నుంచి ఈనెల 21వ తేదీ సాయంత్రం వరకు 50 డివిజన్లలో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 22వతేదీ ఉదయం మంచి నీటి సరఫరా పునః ప్రారంభమవుతుందని చెప్పారు.

ఉద్దానం ప్రాజెక్టు పరిధిలో..

కంచిలి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కంచిలి జాతీయరహదారి సమీపంలో గల కుంటికోట వద్ద మెయిన్ పైపులైన్ పనుల దృష్ట్యా సోమవారం నుంచి వారం రోజుల పాటు న్యూఉద్దానం ప్రాజెక్ట్ ద్వారాఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలో గల గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు సోంపేట సబ్‌డివిజన్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కె.ముకేష్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. పనులు పూర్తయిన వెంటనే యథావిధిగా ప్రతిరోజూ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

నేడు ఆదిత్యుని హుండీల లెక్కింపు

అరసవల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆదిత్యుని హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వై.భద్రాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఛైర్మన్ ఇప్పిలి జోగి సన్యాసిరావు, ప్రధానఅర్చకులు ఇప్పిలి శంకరశర్మ, గ్రామపెద్దలు, అధికారుల సమక్షంలో అనివెట్టి మండపంలో హుండీలను లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

రేపు విభిన్న ప్రతిభావంతులకు ఆటల పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో అంతర్జాతీయ వికలాంగు దినోత్సవం పురస్కరించుకుని బుధవారం విభిన్న ప్రతిభావంతులకు కేటగిరిల వారీగా ఆటలపోటీలు నిర్వహించేందుకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా కేటగిరిల వారీగా కలెక్టర్ కార్యాలయం వద్ద గల డీఆర్‌డీఏ కాంప్లెక్స్ ఎదురుగా గల డచ్ భవనం వద్ద మైదానంలో ఉదయం 10గంటలకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఆసక్తి గల విభిన్న ప్రతిభావంతులు పోటీల్లో పాల్గొనాలని కోరారు.

24న జిల్లాస్థాయి కబడ్డీ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని కోడిరామ్మూర్తి స్టేడియంలో ఈనెల 24నఉమ్మడి జిల్లాస్థాయి పురుషులు, మహిళల కబడ్డీ జట్ల ఎంపికలను నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ సంఘం ఛైర్మన్, ఎమ్మెల్యే గొండు శంకర్, అధ్యక్షుడు నక్క కృష్ణారావు, కార్యదర్శి సాధు ముసలినాయుడు పేర్కొన్నారు. ఎంపికలు హాజరయ్యే పురుషులు 85 కేజీలు, మహిళలు 75 కేజీలు బరువు ఉండాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబరు ఐదు నుంచి ఎనిమిదో తేదీ వరకు ప్రకాశంజిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

సివిల్స్ పరీక్షలకు ఉచితంగా కోచింగ్

అరసవల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు రాష్ట్ర వెనుకబడిన సంక్షేమశాఖ సంచాలకుల ఆదేశాల మేరకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ శ్రీకాకుళం డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన బీసీ, ఎస్సీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హతగల అభ్యర్థులు తమ దరఖాస్తులను శ్రీకాకుళంలోని బీసీ సంక్షేమశాలోగల స్టడీ సర్కిల్‌కు ఈనెల 24లోగా అందజేయాలని కోరారు. అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి ఎంపికచేస్తామని, ఎంపికైన అభ్యర్థులకు విజయవాడలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు శ్రీకాకుళంలోని 80 ఫీట్‌రోడ్డులో గల జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖలో ఉన్న స్టడీ సర్కిల్‌ను సంప్రదించాలని కోరారు.

మాదక ద్రవ్యాల రవాణా నియంత్రణపై పోటీలు

ఎచ్చెర్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగంపై అడ్డుకట్టు వేసేలా యువతను చైతన్యపరిచేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్శిటీలో పలుపోటీలను నిర్వహించనున్నట్లు వర్శిటీరిజిస్ట్రార్ పి.సుజాత ఒకప్రకటనలో తెలిపారు. వర్శిటీ క్యాంపస్‌తోపాటు అనుబంధ కళాశాలల విద్యార్థులు కూడా పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. గంజాయి, మహిళలు చిన్నారులకు వ్యతిరేకంగా జరుగుతున్న నేరాలు, మద్యం తాగుతూ వాహనాలు నడపడం, సైబర్ క్రైమ్ అంశాలపై పోస్టర్ తయారీ, వీడియో, లఘు చిత్రం రూపకల్పనకు సంబంధించిన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.తెలుగు, ఇంగ్లీషు భాషల్లో చేయాల్సి ఉంటుందని, వర్శిటీ చిహ్నం ఉంటూ ఎ-3 సైజులో ఉన్న కంప్యూటర్ డిజైన్ మాత్రమే పోటీలకు అనుమతించనున్నట్లు పేర్కొన్నారు.ఆసక్తిగల వారు ఈనెల 25లోగా తమ పేర్లను నమోదు చేయసుకోవాలని కోరారు.

భౌగోళిక సమాచార వ్యవస్థతో మేలు

● డైరెక్టర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ డైరెక్టర్ శరత్‌చంద్ర సాహు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పరిశోధకులు,శాస్త్రవేత్తలు

పర్లాకిమిడి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): భౌగోళిక సమాచార వ్యవస్థతో నిత్య జీవితంలో ఎంతో మేలు జరుగుతుందని భువనేశ్వర్‌కు చెందిన డైరెక్టర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ డైరెక్టర్ డాక్టర్ శరత్‌చంద్ర సాహు తెలిపారు.సోమవారం పర్లాకిమిడి సమీపంలో గల ఆర్.సీతాపురం వద్ద గల సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయభౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్) దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ భౌగోళిక సమాచారంకోసం కేంద్రప్రభుత్వం శాటిలైన్ వ్యవస్థను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అనంతరం కృత్రిమ మేదస్సు నీటివనరులు, వినియోగం, సాంకేతిక పరిజ్ఞానం, మిసెన్ లెర్నింగ్,అర్బన్‌ప్లానింగ్ పర్యావరణాన్ని ఎలాకాపాడుకోవాలి, వ్యవసాయం, విపత్తుల నివారణ, నిర్వహణ, వంటి విషయాలు శాస్త్రీయ ప్రదర్శనపై పేపర్లు, పోస్టర్లు ప్రదర్శించారు. జాతీయ,అంతర్జాతీయస్థాయి నుంచి175 పరిశోధన సారాంశాలు స్వీకరించగా వాటి నుంచి 119 హైబ్రీడ్ ప్రదర్శనకోసంఎంపికచేశారు. కార్యక్రమంలో సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అనిల్‌పాత్రో, డైరెక్టర్ ఎడ్మినిస్ట్రేషన్ దుర్గాప్రసాద్ పాడి, బిక్రమ్ నారాయణ, 350మందికిపైగా శాస్త్రవేత్తలు, మేదావులు, విద్యార్థులు, పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

మహిళా పైలెట్లను 25 శాతానికి పెంచడమే లక్ష్యం

● కేంద్రపౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు



విమానయాన రంగంలో గల అవకాశాలను వివిధ కళాశాలల విద్యార్థినులకు వివరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

గుజరాతీపేట, నవంబరు18(ఆంధ్రజ్యోతి):దేశంలో మహిళా పైలెట్లను 25శాతానికి పెంచడమే లక్ష్యమని కేంద్రపౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా కేవలం ఐదుశాతం మాత్రమే మహిళా పైలెట్లు ఉండగా, దేశంలో 15శాతం మంది ఉండడం గమనార్హమని చెప్పారు. సోమవారం శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఇన్ ఏవియేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఉమెన్ ఏవియేషన్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భోగాపురం ఎయిర్‌పోర్టుతోపాటు మూలపేటపోర్టు సమీపంలో మరోవిమానాశ్రయం నిర్మాణంతో జిల్లాలోని యువతకు ఎన్నో ఉద్యోగ,ఉపాధి అవకాశాలు అబిస్తాయని తెలిపారు. పైలెట్, ఎయిర్‌హోస్టెస్, కస్టమ్స్, ఇంజినీరింగ్, ఇమ్మిగ్రేషన్ సహా ఎన్నో విభాగాల్లో మహిళలకు గల అవకాశాలను వివరించారు. దీనిపై దేశవ్యాప్తంగా 30 నగరాల పరిధిలో దాదాపు 30 వేల మంది విద్యార్థినులను కలిసి అవగాహన కల్పిస్తున్న ఉమెన్ ఇన్ ఏవియేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్, సంస్థ ఉపాధ్యక్షురాలు కమల చక్రవర్తి, సభ్యులు అంజలిచౌహాన్, అర్చన, కీర్తి, తివారి, కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, టీడీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సుజాత, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ మిషన్ లక్ష్యాలను సాధించాలి

● రన్నింగ్ వాటర్‌కోసం చర్యలు తీసుకోండి: కలెక్టర్



సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ మిషన్ లక్ష్యాలను సాధించేందుకు అందరూ కృషి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జల్ జీవన్‌మిషన్, స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్ డిస్ట్రిక్ట్ వాటర్ అండ్ శానిటేషన్ మిషన్‌పై జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల్లో ప్రతీఇంటికి మరుగుదొడ్లు ఉండేలా పంచాయతీరాజ్, స్వచ్ఛంద సంస్థలు ప్రజలను చైతన్యపరచాలని కోరారు. బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు, ఆసుపత్రులు, బహిరంగ ప్రదేశాలు, దేవాలయాలు తదితర ప్రాంతాల్లో మరుగుదొడ్ల వద్ద రన్నింగ్ వాటర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో డీఆర్వో వేంకటేశ్వరరావు, డీపీవో కె.భారతి సౌజన్య, జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, డ్వామా పీడీ సుధాకర్, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, డీఐపీఆర్వో కె.,చెన్నకేశవరావు, గ్రౌండ్ వాటర్ డీడీ రమణమూర్తి, వ్యవసాయశాఖ జేడీ త్రినాథస్వామి పాల్గొన్నారు.

అపార్ ఐడీల నమోదు వేగవంతం చేయాలి

గుజరాతీపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అపార్ ఐడీలు నమోదు వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యాశాఖ, ఆర్‌ఐవో, డీవీఈవో, మునిసిపల్ కమిషనర్, కళాశాల ప్రిన్సిపాల్‌తో సమావేశం నిర్వహించారు. కార్య క్రమంలో డీఈవో తిరుమల చైతన్య, ఆర్‌ఐవో దుర్గారావు, డీవీఈవో తవిటినాయుడు, మునిసిపల్ కమిషనర్ పివివిడి ప్రసాదరావు, ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి పాల్గొన్నారు.

నగరపాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించాలి

●శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



మాట్లాడుతున్న గొండు శంకర్

శ్రీకాకుళం, నవంబరు18(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో జరిగిన వార్డులరిజర్వేషన్ ప్రక్రియను పునఃపరిశీలించి వీలైనంత త్వరలో ఎన్నికలు నిర్వహించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. శ్రీకాకుళంలో ఇప్పటికీ బ్రిటీష్‌కాలం నాటి డ్రైనేజీ వ్యవస్థే ఉందని తెలిపారు.సోమవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ బ్రిటీష్‌కాలంనాటి డ్రైనేజీ వ్యవస్థ వల్ల కొద్దిపాటి వర్షం కురిసినా నగరంలో రోడ్డుపై వర్షం, మురుగునీరు ప్రవహిస్తోందని తెలిపారు. నగరపాలక సంస్థకు14ఏళ్ల నుంచి ఎన్నికలు నిర్వహించలేదని చెప్పారు. గత ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించేందుకు వార్డులను విభజించేసి.. రిజర్వేషన్లను మార్పుచేసి డీలిమిటేషన్ అడ్డగోలుగా చేసిందని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి జీవోలు ఇవ్వాలి

● ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు నాగమణి

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి సంబంధించి ప్రభుత్వం ఒప్పంద జీవోలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు, ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు కె.నాగమణి, సీఐటీయూజిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ధనలక్ష్మి, జి.అమరావతి డిమాండ్‌చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆశాకార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తొలుత ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి ర్యాలీ నిర్వహించారు.అనంతరం అదనపు డీఎంహెచ్‌వో బి.సత్యవాణికి వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి, నగర కన్వీనర్ ఆర్.ప్రకాష్, యూనియన్ నాయకులు ఎం.లావణ్య, స్వర్ణలత, దమయంతి, సుజాత, గౌరమ్మ, జ్యోత్స్న, చంద్రకళ, చంద్రమ్మ, స్వర్ణ, సత్య పాల్గొన్నారు.

108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలి

అరసవల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 108 కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని, సమస్యలను పరిష్కరించాలని, ఎనిమిది గంటల పని విధానం అమలుచేయాలని కోరుతూ 108 యూనియన్ ఉద్యోగులు సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోనిమహాత్మా జ్యోతిబాపూలే పార్కు వద్ద సోమవారం నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, యూనియన్ జిల్లా అధ్యక్షుడు టి.విజయమోహన్, ప్రధాన కార్యదర్శి పి.సత్యం, నాగభూషణం, శ్రీనివాసరావు, దుర్గారావు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ఇచ్ఛాపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): 104 ఉద్యోగులు సమస్యలు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని 104 ఎంఎంయూ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లాఅధ్యక్షుడు ఆర్.సురేష్‌బాబు కోరారు.ఈ మేరకు ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి దాసరిరాజుకు సోమవారం యూనియన్ ఇచ్ఛాపురం నియోజకవర్గ అధ్యక్షుడు సీహెచ్ నారాయణ, జనరల్ సెక్రటరీ డి.కిరణ్, ట్రెజరర్ ఎస్.నరేష్ తదితరులు వినతిపత్రం అందజేశారు.

దోషులను అరెస్టు చేయాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి మండలంలోని కిష్టుపురంలో గత నెల 27నదళితులు దమయంతి, అప్పలరాజు దంపతులపై ధర్మాన శ్రీనివాసరావు, ప్రసాద్ దాడిచేసి తీవ్రంగా గాయపరిచారని ఫిర్యాదుచేసినా నిందితులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.సింహాచలం, కుల వివక్ష పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి జోగి.గన్నయ్య, ఉపాధ్యక్షుడు భవిరి.కృష్ణమూర్తి ఆరోపించారు. ఈమేరకువారు సోమవారం స్థానిక జడ్పీ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దాడి జరిగి ఇన్ని రోజులైనా పోలీసులు పట్టించుకోవడం లేదని, దోషులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్‌చేశారు. అనంతరం మీకోసంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో కులవివక్ష పోరాట సమితి సభ్యులు కాల నర్సింహ, బాధితులు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసులపై దృష్టి సారించండి

● జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా



మాట్లాడుతున్న జునైద్ అహ్మద్ మౌలానా

గుజరాతీపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులపై దృష్టి సారించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా కోరారు. సోమవారం జిల్లా కోర్టు భవనంలో పోలీసు, ఎక్సైజ్, లేబర్, విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబరు 14న జరగనున్న లోక్‌అదాలత్‌లో రాజీపడదగ్గ క్రిమినల్, ఎక్సైజ్ కేసులను ఎక్కువ రాజీ చేయాలని కోరారు. కార్యక్రమంలో 1వ, 4వ అదనపు జిల్లా న్యాయాధికారులు పి.భాస్కరరావు, ఎం.ఫణికుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ప్రిన్సిపల్ సివిల్ న్యాయాధికారి కేఎల్‌వీ హిమబిందు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, జైలు అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. సోమవారం మండలంలోని కొత్తవలసలో సైబర్ మోసాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో సత్తాచాటిన క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఇంటర్ చదువుతున్న ముగ్గురు క్రీడాకారులు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుడివాడలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-19 వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో సత్తాచాటి మూడు పతకాలు సాధించారు. 64 కేజీల విభాగంలో బి.యోగేశ్వరరావు (శ్యామ్‌పాలేం) స్నాచ్ 75 కేజీలు, క్లీన్ అండ్ జర్క్ 105 మొత్తం 180 కేజీలు ఎత్తి రజిత పతకం, 67 కేజీల విభాగంలో పి.చంద్రశేఖర్ (శ్రీకూర్మం) స్నాచ్ 63, క్లీన్ అండ్ జర్క్ 75 కేజీలు, మొత్తం 138 కేజీలు ఎత్తి కాంస్య పతకం, 70 కేజీల విభాగంలో టి.కావ్య (ఆడవరం) స్నాచ్ 45 కేజీలు, క్లీన్ అండ్ జర్క్ 65 కేజీలు, మొత్తం 11 కేజీలు ఎత్తి రజిత పతకాన్ని సాధించారు. జట్టుకు కోచ్‌గా ఇప్పిలి అప్పన్న వ్యవహరించారు. క్రీడాకారులను బీవీ రమణ, ఎంవీరమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్ అభినందించారు.

శానిటరీ మేస్త్రీలను విధుల్లోకి తీసుకోవాలి

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అకారణంగా తొలగించిన మునిసిపల్ శానిటరీ మేస్త్రీలను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ మునిసిపల్ యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కల్యాణి అప్పలరాజు, అధ్యక్షుడు కె.వేణుగోపాలరావు హెచ్చరించారు. తొలగించిన శానిటరీ మేస్త్రీలను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మునిసిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆరో రోజుకు చేరుకుంది.ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాయలం ఎదుట కార్మికులు అర్ధ నగ్నంగా నిరసన తెలిపారు. సమ్మెలో మేస్త్రీల సంఘం అధ్యక్షుడు ఎం.రామారావు, ఎ.రవి, టి.షణ్ముఖరావు, మునిసిపల్ యూనియన్ నాయకులు జె.గురుమూర్తి, పార్థసారధి, గణేష్ పాల్గొన్నారు.

మెట్టక్కివలసలో టీడీపీ సభ్యత్వ నమోదు

ఆమదాలవలస, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మెట్టక్కివలసలో టీడీపీ ఇన్‌చార్జి ఎన్ని శ్రీదేవి ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదుకార్యక్రమాన్నినిర్వహించారు. కార్యక్రమంలో వసంత్, నాగళ్ల మురళీధర్‌యాదవ్ పాల్గొన్నారు.

బాహుదా చానళ్లను ఆధునికీకరించండి

ఇచ్ఛాపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మండలంలోని 11 బాహుదా చానళ్లను ఆధునికీకరించాలని టీడీపీ నాయకులు దక్కత శ్రీను, దక్కత కామేష్ కోరారు.ఈ మేరకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు సోమవారం శ్రీకాకుళంలో వినతిపత్రాన్ని అందజేశారు.

బాధితులకు న్యాయం చేయాలి



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళంక్రైం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):ప్రజా ఫిర్యాదులకు జిల్లా పోలీసు యంత్రాంగం ప్రాధాన్యతనివ్వాలని, ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి కోరారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోనిర్వహించిన ప్రజాఫిర్యాదుల వేదిక మీకోసంలో 50 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా ఎస్పీ అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. చట్ట ప్రకారం పూర్తిస్థాయిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశించారు.

పనితీరును పర్యవేక్షించండి

జిల్లా పోలీసు కార్యాలయ పని తీరును పర్యవేక్షించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి కోరారు. సోమవారం జిల్లా పోలీసు అదనపు ఎస్పీ (అడ్మిన్)గాకేవీ రమణ బాధ్యతలు స్వీకరిం చారు. ఈమేరకు ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అలాగే ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా జిల్లాకు వచ్చిన జి.సీతారామారావు కూడా ఎస్పీని కలుసుకున్నారు.

కొత్తకొజ్జిరియాలో వైద్యశిబిరం

కవిటి, నవంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకొజ్జిరియాలో సోమవారం బెలగాం పీహెచ్‌సీ సిబ్బంది వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామస్థులు జ్వరాలతో బాధపడుతున్నారని ఎమ్మెల్యే అశోక్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన డీఎంహెచ్‌వో బి.మీనాక్షి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. చికెన్ గున్యా పరీక్షల కోసం గ్రామస్థులకు సంబంధించిన శాంపిళ్లను రిమ్స్‌కు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పి.రాకేష్, కవిత పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం పరిశీలన

కంచిలి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అపార్ కోసం ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు శివరాంప్రసాద్, చిట్టిబాబు కోరారు. సోమవారం కంచిలిలో ఏర్పాటు చేసిన అపార్ ఆధార్‌సెంటర్‌ను పరిశీలించారు.

సమన్వయంతో ముందుకువెళ్లండి

ఇచ్ఛాపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీని బలోపేం చేయడానికి కృషి చేయడంతో పాటు సమన్వయంతో పార్టీని ముందుకు తీసుకువెళ్లాలని ఆ పార్టీ అధ్యక్షుడు జగన్‌మ్మోహన్‌రెడ్డి కోరారు.ఈ మేరకు శ్రీకాకుళం జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ, వైసీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పిరియా సాయిరాజ్ ఆయన్ను కలిశారు.

ఎస్టీపీని ఏర్పాటు చేయవద్దు

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మురుగునీటి శుద్ధి ప్లాంటను(ఎస్టీపీ) తమ గ్రామంలో జనవాసాల మధ్య ఏర్పాటుచేయ వద్దని ఆమదాలవలస మునిసిపాలిటీ పరిధిలో గల గేదెలవానిపేట గ్రామస్థులు కోరారు.ఈ మేరకు సోమవారం మీకోసంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న ఈ ప్లాంట్‌ను నిర్వీర్యం చేయాలనే గ్రామం మధ్యలో నిర్మిస్తున్నారని, చుట్టు ప్రక్కల నివాస గృహాలు ఉన్నాయని, ప్రజలు చాలా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు.

ఒడియా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

కవిటి, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ఒడియా ఐటీడీఏ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని ఒడియా టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్‌పాడి, ప్రధానకార్యదర్శి బృందావన్ దొళాయి కోరారు. సోమవారం అమరావతిలో రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి జి.సంధ్యారాణిని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. ఒడియా మైనార్టీల భాష, విద్యాభివృద్ధికి పాటుపడాలని కోరారు.

● ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్ విప్‌గా నియమితులుకావడంతో ఆయన్ను అమరావతిలో కవిటి మండల టీడీపీనాయకులు మణిచంద్రప్రకాష్, కృష్ణారావు, రమణ, భీమారావురౌళో, సంతోష్‌పట్నాయక్ అభినందించారు.

హైందవ శంఖారావం జయప్రదం చేయాలి

రణస్థలం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జనవరి ఐదో తేదీన జరగనున్న హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలని వీహెచ్‌పీ ధర్మప్రసార ప్రముఖ్ పొగిరి సూర్యానారాయణ పిలుపునిచ్చారు. సోమవారం రణస్థలంలో మాట్లాడుతూ ఆలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలని డిమాండ్ చేశారు.

నేర నియంత్రణలో భాగస్వామ్యం కావాలి

శ్రీకాకుళంక్రైం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలని టూటౌన్ సీఐ పి.ఈశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం నగర పాలక సంస్థ పరిధిలోని తొమ్మిదో డివిజన్‌లో పాదలమ్మ చెట్టువద్ద సంకల్పంకార్యక్రమంనిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్‌ఇన్‌చార్జి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

గుజరాతీపేట,నవంబరు18(ఆంధ్రజ్యోతి): డీఈవో కార్యాలయంలో సిబ్బందిపై దుర్భాషలాడుతూ, దౌర్జన్యానికి పాల్పడడంతో సీలిభద్ర ఎంపీయూపీ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తమ్మినాన శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్పీకి సూచనలు జారీచేశారు. తనకు సంబంధంలేని విషయాలపై బయట వ్యక్తులతో దౌర్జన్యానికి పాల్పడినట్లు డీఈవో కార్యాలయ సిబ్బంది, ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ తరపున కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు విచారించి చర్యలు తీసుకోవాల్సిందిగా ఎస్పీకి సూచించారు.

క్రైం కార్నర్

తెప్ప బోల్తాపడి మత్స్యకారుడి మృతి


అనిల్‌కుమార్(ఫైల్)

రణస్థలం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అల్లివలస గ్రామానికి చెందిన మత్స్యకారుడు వి.అనిల్‌కుమార్ (34) సోమవారం తెప్పబోల్తా పడి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. అనిల్‌కుమార్‌తో పాటు మరో ఇద్దరు చేపల వేట నిమిత్తం సోమవారం ఉదయం సముద్రంలోకి వెళ్లారు. అయితే మధ్యాహ్నం ఒడ్డుకు చేరే సమయంలో సముద్రపు అలల ధాటికి తెప్ప బోల్తా పడింది. దీంతో తెప్పకింద అనిల్‌కుమార్ ఉండి పోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. మరో ఇద్దరు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. మృతుడికి భార్య లక్ష్మి, బాబు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్‌పురం పోలీసులు కేసు నమోదు చేశారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

కోటబొమ్మాళి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిమ్మాడ జంక్షన్ వద్ద హైవేపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నరసన్నపేట మండలం కోమర్తికి చెందిన డ్రైవర్ కొమర్తి రామారావుకు చెందిన ఆటోలో దుర్గన రాజేశ్వరి, గుమ్మడి మాణిక్యం, కొల్లి రాములమ్మ, కొల్లి గుణావతి, కమునాపల్లి సరస్వతి కార్తీకమాసం మూడో సోమవారం రావివలస శివాలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా నిమ్మాడ సమీపంలోకి వచ్చే సరికి ఒక మతిస్థితిమితం లేదని వ్యక్తి అకస్మాత్తుగా ఎదురుగా రావడంతో డ్రైవర్ షడన్ బ్రేక్ వేశాడు. దీంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బంది క్షతగాత్రులను నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలిం చారు. ఈ ఘటనపై పోలీసుల వద్ద ప్రస్తావించగా తమకు ఎటువంటి సమాచారం రాలేదన్నారు.

యువతి అదృశ్యం


అదృశ్యమైన శ్రావణి

నందిగాం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పెద్దతామరా పల్లి గ్రామానికి చెందిన సవలాపురం శ్రావణి(25) అదృశ్యమైనట్లు తండ్రి నరసయ్య సోమవారం ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ షేక్‌మహ్మద్ ఆలీ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శ్రావణి ఈనెల 15న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆమె ఆచూకీ కోసం బంధువుల ఇళ్లలో వెదికారు. అయితే ఆచూకీ లభ్యం కాకపోవడంతో తండ్రి నరసయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

పాతపట్నం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. స్థానిక అంతరాబ కూడలి వద్ద తనిఖీల్లో మద్యం బాటిళ్లతో పట్టుబడిన నిందితుడి నుంచి 8 ఫైన్ గ్రీన్‌విస్కీ 180ఎంఎల్ నిబ్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. ● పేడూరు గ్రామ సమీపంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది సోమవారం దాడులు నిర్వహించారు. గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో 300 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

తునిలో బెలగాం వాసి మృతి


ధనుంజయ(ఫైల్)

కవిటి, నవంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెలగాం గ్రామానికి చెందిన జి.ధనుంజయ (30) తునిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. తునిలోని ధనుంజయ డ్రైవరుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనం బోల్తాపడడంతో ఆయనకు గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. ధనుంజయకు భార్య లతతోపాటు రెండేళ్ల పాప ఉన్నారు.

పుచ్చ ఈశ్వరరావుకు అభినందన


పుచ్చ ఈశ్వరరావును అభినందిస్తున్న గునాలపాడు గ్రామస్థులు

వజ్రపుకొత్తూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పుచ్చ ఈశ్వరరావును సన్నిహితులు, మిత్రులు, అభిమానులు సోమవారం అభినందించారు. టీడీపీ బలోపేతానికి ఈశ్వరరావు చేసిన సేవలకు తగిన గుర్తింపు లభించిందని పలువురు అన్నారు. గోవిందపురం పంచాయతీ గునాలపాడు గ్రామానికి చెందిన ప్రజలు, అభిమానులు పుచ్చ ఈశ్వరరావును అభినందించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, గునాలపాడుకు చెందిన ధుర్యోధన, బాలరాజు, ఫల్గుణరావు పాల్గొన్నారు.

పలాస అభివృద్ధికి ఎమ్మెల్యే శిరీష కృషి

వజ్రపుకొత్తూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే గౌతు శిరీష విశేషంగా కృషి చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షు డు బుల్లోజు శశిభూషణ్, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ దువ్వాడ హేంబాబుచౌదరి, మాజీ వైస్ ఎంపీపీ దాసరి జేజేరావు అన్నారు. సోమవారం ఎయిర్‌పోర్టు కోసం అధికారులు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం జరిగితే తీర ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. తితలీ తుఫాన్ దెబ్బకు రైతులు తీవ్రంగా నష్టపోయారని ఎయిర్‌పోర్టు నిర్మాణంతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కుంది దుర్గారావు, పుక్కళ్ల ఉమా మహేశ్వరరావు, మద్దు పుణ్యవతి, జ్యోతి, కుమారి, జూలీ పాల్గొన్నారు.

పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

● రెవెన్యూ మంత్రిని కోరిన ఎమ్మెల్యే ఎంజీఆర్



పాతపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం నియో జకవర్గపరిధిలో ఇండస్ట్రి యల్ కారిడార్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్‌ను సచివాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. అత్యంత వెనుకబడిన నియోజకవర్గంలో పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఎంతోమందికి ఉపాధి కలిగి వలసలు ఆగుతాయన్నారు. అలాగే వైసీపీ ప్రభుత్వ పాలనలో జగనన్న కాలనీల పేరుతో జరిగిన అవినీతితో విలువైన ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు గురయ్యాయని, వాటిపై విచారణ చేపట్టాలని వినతిపత్రం అందించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

పలాసరూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): టెక్కలిపట్నం గ్రామానికి చెందిన కె.పాపారావు(62) సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాశీబుగ్గ పోలీసులు, మృతుడి భార్య నారాయణమ్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పాపారావు ఆదివారం ఉదయం పొలానికి వెళ్తానని చెప్పి వెళ్లాడు. ఎంతకీ ఇంటికి రాక పోవడంతో పొలానికి వెళ్లి చూడగా అక్కడ పడి ఉన్న పాపారావును గమనించి స్థానికుల సాయంతో 108 వాహనంలో శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ పోలీసులు తెలిపారు. మృతికి కారణాలు తెలియరాలేదు.

ఎండల మల్లన్నా.. ఇదేందన్నా!

● నీ దర్శనానికి వస్తే ప్రసాదం లేదా?
● ఉదయం 11గంటలకే ఉచిత ప్రసాదాల పంపిణీ పూర్తి
● దేవాలయ అధికారుల తీరుపై భక్తుల విస్మయం


ఉదయం 11గంటలకే ఉచిత ప్రసాదం కౌంటర్ మూసివేయడంతో వెనుదిరుగుతున్న భక్తులు

టెక్కలి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవక్షేత్రం రావివలసలోని ఎండల మల్లికార్జున స్వామి ఆలయానికి కార్తీక మాసం మూడో సోమవారం వచ్చిన భక్తులకు ఉచిత ప్రసాదం అందకపోవడంతో భక్తులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ సోమవారం వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామిని తనివితీరా దర్శించుకున్నప్పటికీ దేవాలయ అధికారుల చర్యల వల్ల ఉదయం 11 గంటలకే ఉచిత ప్రసాదం అయిపోయింది. దీంతో ఆ తరువాత వచ్చిన భక్తులకు ప్రసాదం అందలేదు. దీంతో వారు ఆవేదన చెందారు. ఎంతమంది భక్తులు వచ్చినా వారందరికి ఉచితంగా ప్రసాదం పంపిణీ చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టమైన ఆదేశాలిచ్చినా వారు బేఖాతర్ చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సోమవారం ఉదయం 11గంటలకే భక్తులకు ఇచ్చే ఉచిత ప్రసాదం పులిహార పంపిణీ నిలిపి వేశారు. వేలాది మంది భక్తులు వస్తారని తెలిసినా అరకొర ప్రసాదం తయారీ చేయడంపై భక్తులు పెదవి విరుస్తున్నారు. కార్తీక మాసం ఒకటి, రెండు సోమవారాలు గ్రామస్థులు నార్ల కృష్ణమూర్తి, రావివలస రమణయ్య ప్రసాదాలు అందజేశారు. మూడో వారం ప్రసాదం భక్తులకు ఉదయం 11 గంటలకే అందకపోయే సరికి తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. అయితే దారి పొడుగునా భక్తులు, దాతలు మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు అందజేయడంతో కొంత ఉపశమనం పొందారు. టెక్కలికి చెందిన అయ్యప్ప శాస్త్ర సమాజం నిర్వాహకులు టెక్కలిలో ఉచితంగా పులిహార ప్రసాదాన్ని పెద్దఎత్తున పంపిణీ చేశారు.

వైసీపీ హయాంలో ప్రతిపక్ష నేతలపై దువ్వాడ అనుచిత వ్యాఖ్యలు

● ఎమ్మెల్సీ శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోండి
● పోలీసులకు జనసేన నేతల ఫిర్యాదు


ఎమ్మెల్సీ దువ్వాడపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్

టెక్కలి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో 2019 నుంచి 2024 వరకు వివిధ సందర్భాల్లో వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అప్పటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ల ప్రతిష్ఠకు భంగం కలిగేలా మాట్లాడారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జనసేన టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్ కుమార్‌తో పాటు పలువురు ఆ పార్టీ నేతలు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు టెక్కలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ప్రతిని అందించారు. ప్రతిపక్ష పార్టీల నేతలు, ఆ పార్టీల కార్యకర్తల మనోభావాలు దెబ్బతినేలా దువ్వాడ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే పవన్ కల్యాణ్ వివా హాలపైన, ఆయన వ్యక్తిగత జీవితంపైనా సభ్యసమాజం సిగ్గుపడేలా నీచమైన పరుష పదజాలంతో దుర్భాషలాడారని పేర్కొన్నారు. ప్యాకేజ్ స్టార్, డ్రగ్స్ సేవించేవాడని, మద్యం సేవించి వారాహి సభలకు వచ్చేవాడని, చెప్పుతీసి కొడతానంటూ కేకలేసేవాడని.. ఇంకా రాయలేని భాషలో మాట్లాడేవాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధ్యతగల ప్రజా ప్రతినిధిగా ఉంటూ రాజ్యాంగంపై ప్రమాణం చేసి రాజ్యాంగం ఇచ్చిన విలువలను కాపాడతానని చెప్పి ఇలా ప్రజలను తప్పుదోవ పట్టించేలా పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని, అత్యంత విచారకరమని పేర్కొన్నారు. దువ్వాడ చేసిన వ్యాఖ్యలు వల్ల జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉండడం వల్ల తామంతా దువ్వాడ శ్రీనివాస్‌పై ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు. ఈ విషయాలపై నేటికీ వివిధ చానెళ్లు, యూట్యూబ్ చానళ్లలో ప్రచారంలో ఉన్నాయని పేర్కొంటూ వాటికి సంబంధించిన వీడియోలను పెన్‌డ్రైవ్‌లో పొందు పరిచి పోలీసులకు అందించారు. వెంటనే పరిశీలించి దువ్వాడపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో జన సైనికులు గవ రయ్య, కుమారస్వామి, త్రివేణి, రమణ, భాస్కర్, నరేష్, శోభన్, నాగ, అశోక్, గణేష్, శ్యామ్, వినోద్, అప్పల స్వామి, స్వాదీన్, జగదీష్, హరి ఉన్నారు.

లక్ష్యసాధన దిశలో విద్యాభ్యాసం చేయాలి

మందస,నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యసాధన దిశలో విద్యను అభ్యసించాలని, ఇతర అంశాలపై దృష్టి సారించవద్దని కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు అన్నారు. మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు సంకల్ప్‌లో భాగంగా అవగాహన కలిగించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల విద్యార్థుల జీవితం నాశనమవుతుందని, దీనికి దూరంగా ఉండా లన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సాహ బాబుల్, బి.ప్రవీణ్, దుర్యోధన, నాగేశ్వరరావు, పోలీసులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌పై దుష్ప్రచారం తగదు

కాశీబుగ్గ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్‌పై దుష్ప్రచారం చేయడం దారుణమని ఏపీటీపీసీ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు, గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు పీరుకట్ల విఠల్‌రావు అన్నారు. సోమ వారం ఉదయం అన్న క్యాంటీన్‌ను సందర్శించి పరిశీలించారు. ఇటీవల కాశీబుగ్గ అన్న క్యాంటీన్‌పై లేనిపోని దుష్ప్రచారం నేపథ్యంలో వారు స్పందించారు. స్వయంగా ఆహార పదార్థాలను రుచిచూశారు. అన్న క్యాంటీన్‌పై దుష్ప్రచారం వైసీపీ నేతల పని అని విమర్శించారు. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. వారితో పలువురు టీడీపీ నేతలు ఉన్నారు.

మతోన్మాదులకు అడ్డుకట్ట వేయాలి

టెక్కలి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ సమీక్షల పేరుతో డాక్టర్ అంబేడ్కర్ భావాలకు తూట్లు పొడుస్తున్న మతోన్మాదుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతూ ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కేఎన్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకరరావు, డీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు కోత ధర్మారావు, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు తదితరులు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్యాంగ సమీక్ష పేరుతో రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని, ధర్మాన్ని పాలకులు చెరిపివేయా లని చూస్తున్నారని విమర్శించారు. కేంద్రంలోని మతోన్మాద బీజేపీ విధానాలను వ్యతిరేకించాలని కోరారు. ఒకే దేశం.. ఒకే ఎన్నిక నినాదంతో జమిలీ ఎన్నికలకు బీజేపీ ముందుకు పోతోందని, దీన్ని తిప్పి కొట్టాలన్నారు. కార్యక్రమంలో రాము, వెంకటరావు, తులసి, ఇందిరమ్మ, త్రివేణి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటన హర్షణీయం

సంతబొమ్మాళి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపల వేటకు వెళ్లిన ప్రతి మత్స్యకారుడికి మత్స్యకార భరోసా మంజూరు చేస్తామని అసెంబ్లీలో మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించడం హర్షణీయమని తెలుగుయువత జిల్లా కార్యదర్శి సూరాడ దాసురాజు అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో అర్హులకు మత్సకార భరోసా ఇవ్వలే దని, అనర్హులకే అందించారన్నారు. కూటమి ప్రభుత్వంలో సర్వేచేసి నిజమైన మత్స్యకారులను గుర్తించాలని ఆదేశాలివ్వడం శుభపరిణామ మన్నారు. మత్స్యకారులకు కావాల్సిన వలలు, బోట్లు, ఇతర పరికరాలు 80శాతం సబ్సిడీపై అందిస్తామని మంత్రి ప్రకటించడం వల్ల మత్స్య కారులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన అన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి


బార్ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న న్యాయాధికారులు

పలాస, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రానున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేసేం దుకు న్యాయవాదు లు సహకరించాలని పలాస, కోటబొమ్మాళి మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారులు యు.మాధురి, బీఎంఆర్ ప్రసన్నలత కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పలాస న్యాయాధికారిగా యు.మాధురి బాధ్యతలు తీసుకున్న అనంతరం వారు మాట్లాడుతూ.. పరిష్కారమయ్యే కేసులన్నీ రాజీమార్గంలో లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించు కోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.విశ్వేశ్వరరావు, కార్యదర్శి పిండి వెంకటరావు, జాయింట్ కార్యదర్శి జీఎంఎస్ అనిల్ రాజు, ఉపాధ్యక్షుడు ఫయ్యాజ్ అహ్మద్, సీనియర్ న్యాయవాదులు పి.లక్ష్మీనారాయణ, తాండ్ర మురళీమోహన్, కె.దేవ రాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ యూనివర్సిటీకి రూ.100 కోట్లు కేటాయించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ ప్రతినిధులు

కాశీబుగ్గ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ యూనివర్సిటీ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు డిమాండ్ చేశారు. కాశీబుగ్గలో ఏఐ ఎస్‌ఎఫ్ జిల్లా 20వ మహాసభల నేపథ్యంలో సోమవారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 89 ఏళ్లుగా విద్యార్థి సమస్యలపై పోరాటం చేస్తున్న సంస్థ ఏఐఎస్‌ఎఫ్ అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధా నం వల్ల పేదలకు విద్య అందని ద్రాక్షలా తయారైందన్నారు. జీవో 77 వల్ల సుమారు 70 వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఉన్నత, పీజీ విద్యకు దూర మవుతున్నారన్నారు. హాస్టళ్లలో సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి హాస్టళ్ల సమస్యలను పరిష్కరిం చాలని, పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మటిక్ చార్జీలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవి, ప్రతినిధులు రాము, సూర్య, విజయ్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష దీపారాధన


దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఎల్.ఎన్.పేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సిద్ధాంతం గ్రామంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా లక్ష దీపారాధన చేపట్టారు. పురోహితులు నేతేటి నాగేంద్ర శర్మ ఆధ్వర్యంలో గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని దీపాలను వెలిగించి భక్తిని చాటుకున్నారు.


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

వైభవంగా కుంకుమ పూజలు

హరిపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హరిపురం శివాలయంలో కార్తీక మాసం మూడో సోమవారం పురస్కరించుకొని మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. గాజులు, పసుపు, కుంకుమతో ప్రత్యేక పూజలు చేపట్టి శివునికి మొక్కులు తీర్చుకున్నారు.

ఎన్టీఆర్ నగర్‌లో దుర్గంధంపై ఫిర్యాదు

టెక్కలి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): టెక్కలి పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ సమీపంలో నివాసాల ముందు వ్యర్థాలు వేస్తుండడంతో దుర్గంధంతో అల్లాడుతున్నామని స్థానిక మహిళ కె.సౌజన్యకుమారి తదితరులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో మీకోసంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతి పత్రం అందించారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శికి అనేక పర్యాయాలు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే కంకర బందలోని హుద్ హుద్ కాలనీలో నివాసం ఉంటున్న తన ఇంటికి విద్యుత్ సదుపాయం కల్పించా లని దివ్యాంగుడు ప్రసన్నకుమార్ మహాపాత్రో వినతి పత్రం అందించారు. విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఎస్టీ సంఘ నాయకుడు గేదెల రమణమూర్తి కోరారు. మూలపేట పంచాయతీ విష్ణుచక్రం గ్రామానికి చెందిన గిన్ని రాములమ్మ తనకు పీడీఎఫ్ అందజేయాలని వినతిపత్రం అందించారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

నరసన్నపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇళ్లు, స్థలాలను కేటాయించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాసరావు తదితరులు సోమవారం జమ్ము సచివాలయంలో అధికారులకు వినతి పత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పేదలకు స్థలంతో పాటు ఇళ్ల నిర్మాణానికి సిమెంట్, ఇసుక ఉచితంగా అందజే యాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నెయ్యల నారాయణ రావు, మధు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల విభాగం ప్రారంభం

పలాస, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో సోమవారం ఫిర్యాదుల విభాగాన్ని కమిషనర్ ఎన్.రామారావు ప్రారంభించారు. కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులు, టిడ్కో గృహాలు తదితర సమస్యలపై 60 వినతులు వచ్చాయన్నారు.

ఆక్రమణలను అడ్డుకోండి

కొత్తూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్టూరు బిట్-1 పంచాయతీలోని వంశధార నిర్వాసిత కాలనీలో ప్రభుత్వం రోడ్డుకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమిస్తున్నారని, తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు బూర్లె శ్రీను, బాలరాజు కోరారు. సోమవారం తహసీల్దార్ రవిచంద్ర కు ఫిర్యాదు చేశారు. ఆక్రమణలను తొలగించాలని కోరారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

పాతపట్నం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బాలాజీ నగర్ శివారు ప్రాంతాల్లోని తాగునీటి సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని విశ్రాంత ఆర్మీ ఉద్యోగి బి.నారాయణమూర్తి కోరారు. ఈ మేరకు సోమవారం మీకోసంలో డీటీ వెంకటరమణకు వినతిపత్రం అందించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులుస్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పోలాకి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మబగాం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరావు, ఏఈ విశ్వేశ్వరరావు తెలిపారు. మబగాం, వనితమండలం, ఈదులవలస, ఖాన్ సాహెబ్‌పేట, మబగాం కాలనీ, కుమ్మరి కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

విశాఖ ఉక్కు రక్షణకు ఉద్యమం

కాశీబుగ్గ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిరక్షణకు ఉద్యమం ఉధృతం చేస్తా మని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ జిల్లా అధ్యక్షుడు చౌదరి లక్ష్మణరావు అన్నారు. సోమవారం సంస్థ ఆధ్వర్యంలో పలు ప్రజా సంఘాల మద్దతుతో పోస్టు కార్డు ఉద్య మానికి సంబంధించిన కరపత్రా లను ఆవిష్కరించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని, రూ.10 వేల కోట్లు తక్షణ సాయంగా అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘ నాయకులు దానేశు, బాలకృష్ణ, రామారావు, ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ వైద్యం ఆరోగ్యకరం

కోటబొమ్మాళి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆయుష్ వైద్యం వ్యక్తి ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుందని కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యులు వరుణ్, గురుమూర్తి అన్నారు. సోమవారం జాతీయ ఆయుష్ మిషన్ ఆధ్వర్యంలో కొత్తపల్లి పీహెచ్‌సీ ఆవరణలో ఆశ కార్యకర్తలకు ఆయుష్ వైద్యసేవలపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో కింతలి హోమియో వైద్యాధికారి పి.పద్మజ, సిబ్బంది పాల్గొన్నారు.

యూటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయండి

నందిగాం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా సహాధ్యక్షుడు కె.దాలయ్య, జిల్లా కార్యదర్శి బాలక శంకరరావు కోరారు. సోమవారం నర్సిపురం, దేవళభద్ర, లఖిదాసుపురం, నౌగాం, తురకలకోట ఉన్నత, కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ఈనెల 24, 25 తేదీల్లో మందస మండలం హరిపురంలో ఈ సభలు నిర్వహిస్తున్నామని, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు టి.వైకుంఠరావు, కె.కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలను సకాలంలో అందించాలి

పోలాకి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సంబంధించిన అపార్ ప్రక్రియకు అవసరమైన ధ్రువపత్రాలను సకాలంలో అందించేలా ప్రత్యేకాధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో గరిమెళ్ల రవికుమార్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు మండలంలో 60 శాతం అపార్ ప్రక్రియ నమోదైందని, మిగిలినవి కూడా త్వరిత గతిన చేపట్టాలన్నారు. విద్యార్థి పుట్టిన తేదీ, వివరాలు రేషన్‌కార్డు, ఆధార్ కార్డుల్లో వేర్వేరుగా ఉండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. వీటిని సరిచేసే ప్రక్రియకు ప్రత్యేకాధికారులు దృష్టి సారించాలన్నారు.

టీడీపీ విజయంతో శబరిమలకు పాదయాత్ర

కొత్తూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలానికి చెందిన ఐదుగురు స్వాములు కాలినడకన శబరిమలకు సోమవారం బయలుదేరారు. వీరిలో ఇద్దరు టీడీపీ కార్యకర్తలు ఎద్దు నారాయణస్వామి, గండెం సూర్యనారాయణ గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని స్వామిని కోరుకున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో 23వ సారి అయ్యప్ప దీక్ష చేపట్టి మూడోసారి పొన్నుటూరు నుంచి శబరిమలకు పాదయాత్రగా బయలుదేరామని, అక్కడ మొక్కులు చెల్లిస్తామన్నారు, అలాగే వారితో పాటు పేడాడ కృష్ణ, జామి మోహన్, కలమట మణికంఠ మొక్కులు తీర్చుకునేందుకు పాదయాత్రగా బయలు దేరారు.

వరి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

మందస,నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వరి పంటకు గిట్టుబాటు ధర కల్పించి కల్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేయాలని రైతు సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ ఎస్.హైమవతికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కొర్ల హేమారావుచౌదరి, బి.కామేశ్వరరావు, మాధవరావు పాల్గొన్నారు.